సాక్షి వికారాబాద్

మంగళవారం । 29 । జూలై । 2025



కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు

తాండూరులో కాంగ్రెస్ బలం రోజురోజుకూ పెరుగుతోందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. 8లో▸



ఎమ్మెల్యే ఇంటి ముట్టడి

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఇంటిని సోమవారం ఫార్మాసిటీ బాధితులు ముట్టడించారు. 8లో▸



ఎన్నికల్లో సత్తాచాటుదాం

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బీజేపీ మండల ఇన్‌చార్జిలను నియమించింది. 9లో▸

న్యూస్‌రీల్

నేడు వికారాబాద్‌కు మంత్రి తుమ్మల

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని శివారెడ్డిపేట సమీపంలో మంగళవారం చేపట్టనున్న ఆయిల్ పాం ప్లాంటేషన్ కార్యక్రమానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు. స్పీకర్ ప్రసాద్ కుమార్‌తో కలిసి మంత్రి పాల్గొంటారని పేర్కొన్నారు.

2న కొడంగల్‌కు మంద కృష్ణ



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కొడంగల్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆగస్టు 2న కొడంగల్‌కు రానున్నారని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కొడిగంటి మల్లికార్జున్ తెలిపారు. ఈ మేరకు సోమవారం పట్టణంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. దివ్యాంగులకు రూ.6 వేలు, వృద్ధులు, వితంతువులకు రూ.4 వేల పెన్షన్ ఇవ్వాలనే డిమాండ్‌తో సభ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేశ్వర్‌రావు, అందె రాంబాబు, భీంరాజ్, మున్నంగి నాగరాజు, ప్రశాంత్, ఆనంద్, మల్కప్ప, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు తప్పనిసరి

ఎస్పీ నారాయణరెడ్డి



మర్పల్లిలో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

మర్పల్లి: మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లు, దుకాణాల వద్ద విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక వ్యాపారులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నేరాలు, దోపిడీలను అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో సహకరిస్తాయని చెప్పారు. ప్రతిఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఐ రవూఫ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అభయహస్తం

సంక్షేమ పథకాల అమలుపై దృష్టిసారించిన ప్రభుత్వం



- ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ పనులు వేగిరం
- చురుగ్గా రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ
- మహిళలకు ఉచిత ప్రయాణం, సబ్సిడీపై సిలిండర్లు
- స్థానిక నేతల'అభివృద్ధి పర్యటనలు'

వికారాబాద్: స్థానిక ఎన్నికలకు కసరత్తు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, సంక్షేమంపై ఫోకస్ పెట్టింది. అభయహస్తం హామీలో భాగంగా ఆరు పథకాలపై దృష్టిసారించింది. ప్రధానంగా రేషన్ కార్డుల మంజూరు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఉచిత విద్యుత్, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్ వంటి వాటిపై ప్రత్యేక నజర్ పెట్టింది. వీటిని లబ్ధిదారులకు అందించే పనుల్లో యంత్రాంగం తలమునకలైంది. భూభారతి సమస్యల పరిష్కారంపై కూడా స్పెషల్ ఫోకస్ పెట్టారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్, అడిషనల్ కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆయా శాఖల హెచ్‌ఓడీలు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో పాటు మంత్రులు శ్రీధర్‌బాబు, భట్టి విక్రమార్క, పొంగులేటి, కొండా సురేఖ, చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి ఎమ్మెల్యేలతో కలిసి జిల్లాలో పర్యటిస్తూ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్నారు. స్థానిక పోరులో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.

22,503 కొత్త కార్డులు

ప్రజా పాలన కార్యక్రమంతో పాటు ఆన్‌లైన్‌లో 35వేల పైచిలుకు కుటుంబాలు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నాయి. వీటిపై క్షేత్ర స్థాయి విచారణ చేపట్టిన అధికారులు అర్హుల జాబితాను ప్రభుత్వానికి అందించారు. ఇప్పటి వరకు 22,503 కుటుంబాలకు ప్రభుత్వం కార్డులు మంజూరు చేసింది. దీనికితోడు పాత కార్డులలో కొత్త సభ్యుల వివరాల నమోదు, తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటి వరకు 70,685 కొత్త సభ్యులు రేషన్ కార్డుల్లో చేరారు. జిల్లాలో మొత్తం 2,75,224 రేషన్ కార్డుల ద్వారా 9,91,562 మంది సభ్యులకు సన్న బియ్యం సరఫరా అవుతున్నాయి.

11,785 ఇందిరమ్మ ఇళ్లు..

ఇందిరమ్మ పేరుతో రూ.5 లక్షల నిధులతో ప్రభుత్వం పేదలకు ఇళ్లు మంజూరు చేస్తోంది. తొలి విడతలో ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేసింది. వీటిలో 11,785 గృహాలకు మంజూరు పత్రాలు అందజేయగా 5,506 ఇళ్లకు హౌసింగ్ అధికారులు మార్కింగ్ చేశారు. వీటిలో 605 బేస్మెట్ లెవెల్, 70 రూఫ్ లెవెల్‌లో ఉండగా 25 ఇళ్లకు స్లాబ్ పనులు పూర్తి చేశారు. ఆయా స్థాయిలలో 438 మంది లబ్ధిదారులకు నిధులు విడుదలయ్యాయి.

1,16,990 గ్యాస్ కనెక్షన్లు

జిల్లాలో మొత్తం 2,08,553 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో జనరల్ కనెక్షన్లు 19,358 (డబుల్), 69,902(సింగల్), 3,209 కమర్షియల్, 35,193 దీపం, 38,753 ఉజ్వల్, 21,260 సీఎస్‌ఆర్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో తెల్ల రేషన్ కార్డు కలిగిన 1,16,990 మందికి మహాలక్ష్మి పథకం కింద రూ.500 సిలిండర్ అందుతోంది.

మహిళలకు ఉచిత ప్రయాణం..

జిల్లాలోని పరిగి, తాండూరు, వికారాబాద్ డిపోల పరిధిలోని ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అందిస్తున్నారు. మూడు డిపోల్లో కలిపి ఇప్పటివరకు 3.98 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారు. ఇందుకుగాను ప్రభుత్వం రూ.142 కోట్లు ఖర్చు చేసింది.

రైతుకు భరోసా...

జిల్లాలోని మొత్తం 539 రెవెన్యూ గ్రామాలు, 20 మండలాల పరిధిలో 3,18,447 మంది రైతులు ఉన్నారు. వీరికి ఏడాదికి ఎకరానికి రూ.12,000 చొప్పున రైతు భరోసా నిధులు జమచేస్తోంది. ప్రస్తుత వానాకాలం సీజన్‌కు సంబంధించి ఎకరానికి రూ.6 వేల చొప్పున 2,71,785 మంది రైతులకు రూ.358,17,08,533 ఖాతాల్లో జమచేసింది.

నిరంతర ప్రక్రియ



ప్రభుత్వ పథకాల అమలు నిరంతర ప్రక్రియ. అర్హులైన వారికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు,గృహజ్యోతి, ఆర్టీసీ ఉచిత ప్రయాణం తదితర పథకాలన్నీ అందుతాయి. దరఖాస్తు చేసుకున్న వెంటనే క్షేత్ర స్థాయి అధికారులతో విచారణ పూర్తి చేయించి, లబ్ధిదారులకు అందేలా చూస్తున్నాం.

– ప్రతీక్‌జైన్, కలెక్టర్

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

వ్యాధుల వ్యాప్తిపై అప్రమత్తంగా ఉండండి

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవీందర్‌యాదవ్
- పలు హాస్టళ్లలో తనిఖీలు

కొడంగల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవీంద్రయాదవ్ సూచించారు. పట్టణంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. కలెక్టర్, డీఎంహెచ్‌ఓ ఆదేశాల మేరకు హాస్టల్‌ను విజిట్ చేస్తున్నామన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. వంటశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. దోమల నియంత్రణ మందును పిచికారీ చేయించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగడిరాయిచూర్ పీహెచ్‌సీ డాక్టర్ బుష్రా ఫాతిమా, సబ్ యూనిట్ అధికారి పకీరప్ప, ఎస్‌ఓ స్రవంతి, డాక్టర్ మహేందర్, మధుసూదన్‌రెడ్డి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



కొడంగల్: కేజీబీవీలో మాట్లాడుతున్న డాక్టర్ రవీంద్రయాదవ్

ఆరోగ్యంపై శ్రద్ధచూపాలి

దుద్యాల్: వర్షాకాలం నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రవీంద్రాయాదవ్ సూచించారు. హకీంపేట్ పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ వందనతో కలిసి సోమవారం చెట్టుపల్లితండాలోని కేజీబీవీని సందర్శించారు. విద్యార్థులకు సరైన భోజనం అందుతుందా.. లేదా? అని అడిగి తెలుసుకున్నారు. వంటశాల, స్టోర్ గదిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ డాక్టర్ సౌమ్య, ఏఎన్‌ఎం సహేదా, పాఠశాల ప్రత్యేక అధికారి రాధిక తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'కి 119 ఫిర్యాదులు

అనంతగిరి: ప్రజావాణికి వస్తున్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 119 అర్జీలు వచ్చాయని తెలిపారు. వీటిని పెండింగ్‌లో ఉంచకుండా వెంటవెంటనే క్లియర్ చేయాలని సూచించారు. ఆర్డీఓ వాసుచంద్ర, డీఆర్‌ఓ శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు వినతులను స్వీకరించారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

త్వరగా పూర్తి చేయండి

కలెక్టర్ ప్రతీక్ జైన్

- ఆస్పత్రిలో మరమ్మతు పనుల పరిశీలన

అనంతగిరి: ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో కొనసాగుతున్న మరమ్మతు పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. వికారాబాద్‌లోని ఆస్పత్రిని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డులు, వాష్‌రూంలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఆస్పత్రిలో అన్ని వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెయింటింగ్, మరమ్మతు పనులను పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఈఈ ఉమేశ్, సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

31న కాంగ్రెస్ పాదయాత్ర

పరిగి: కాంగ్రెస్ పార్టీ చేపట్టిన పాదయాత్ర, శ్రమదానం కార్యక్రమాలకు పరిగి నుంచే శ్రీకారం చుట్టనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఇక్కడికి రానున్నారని పేర్కొన్నారు. ఈనెల 31న ప్రారంభమయ్యే పాదయాత్ర మొదటి రోజు రంగాపూర్ నుంచి పరిగి వరకు కొనసాగుతుందని తెలిపారు. రాత్రి ఇక్కడే బస చేసి, మరుసటి రోజు ఉదయం 11గంటలకు శ్రమదానం నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నాయకులతో సమీక్ష ఉంటుందని తెలిపారు.

క్లుప్తంగా

ప్రజావాణికి దరఖాస్తులు నిల్

బంట్వారం: కోట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. ఎంపీడీఓ డానియల్ ఇతర అధికారులు వేచి చూసినప్పటికీ ప్రజల నుంచి స్పందన కనిపించలేదు. ఈ సందర్భంగా ఎంపీడీఓ డానియల్ మాట్లాడుతూ.. మండల ప్రజలు ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏమైనా సమస్యలుంటే ప్రజావాణిలో అర్జీలు అందజేయాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం సత్వర చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సుధీర్‌రెడ్డి, ఆర్‌ఐ భాగ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

భూ తగాదాల కారణంగా ఐదుగురికి బైండోవర్


ఇరు వర్గాలను బైండోవర్ చేస్తున్న తహసీల్దార్, పోలీసులు

దుద్యాల్: భూ తగదాల కారణంగా సోమవారం ఐదుగురిని బైండోవర్ చేశారు. ఎస్‌ఐ యాదగిరి, తహసీల్దార్ కిషన్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని సత్తర్‌కుంట పంచాయతీ అనుసంధాన గ్రామమైన బొల్లి బాయి తండాకు చెందిన ఇట్యా నాయక్, ప్రవీణ్ చౌహాన్, రాహుల్ నాయక్‌లతో చైహాన్ బాబ్యా నాయక్, చైహాన్ అన్ను బాయిలకు కొంత కాలంగా భూ తగాదాలున్నాయి. ఇరు వర్గాలు గతంలో పలుమార్లు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఇరు వర్గాలకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా తిరిగి గొడవపడుతుండడంతో పోలీసులు తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశారు. మరో మారు తగాదా పడితే రూ.2 లక్షల జరిమానతో పాటు రిమాండ్‌కు తరలిస్తామని హెచ్చరించారు.

ఆరు మేకలు అపహరణ


బాధితుడు గేమ్యానాయక్

దోమ: గుర్తు తెలియని దుండగులు ఆరు మేకలు అపహరించారు. ఈ ఘటన దోమ ఠాణా పరిధిలోని దిర్సంపల్లి తండాలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన కేతావత్ గేమ్యానాయక్ మేకలు సాకుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం మేకలు మేపి పాకలో తోలి ఇంటికి వెళ్లాడు. ఉదయం వచ్చి చూడగా ఆరు మేకలు కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించక ఆందోళనకు గురయ్యాడు. సుమారు రూ.లక్ష నష్టపోయానని పోలీసులు దొంగలను పట్టుకోవాలని.. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

ఫొటో షూట్‌కు వెళ్తుండగా కారు బోల్తా

స్వల్ప గాయాలతో బయటపడిన ఫొటో, వీడియో గ్రాఫర్లు


రోడ్డుపక్కన గుంతలోకి దూసుకెళ్లిన కారు

ధారూరు: ఓ ఈవెంట్ ఫొటో షూట్‌కు వెళ్తున్న ఫొటో, వీడియో గ్రాఫర్ల కారు అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటన మండల పరిధిలోని సోమ శంకరప్ప ఆలయ రోడ్డు మలుపులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. హైదరాబాద్ నుంచి తాండూరుకు వెళ్తున్న ఫొటో గ్రాఫర్ల కారు శంకర్ప ఆలయ సమీపంలోని ఓ మూల మలుపు వద్దకు రాగానే తాండూరు నుంచి రెండు లారీలు వేగంగా వస్తున్నాయి. దీంతో భయంతో కారు డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో కారు రోడ్డుకు కుడివైపు ఉన్న గుంతలోకి పడిపోయింది. అక్కడ ఫారెస్ట్ అధికారుల తవ్వించిన మట్టికుప్పలు ఉండడంతో వాహనం ఆగిపోయింది. పక్కనే ఉన్న ఆర్‌అండ్‌బీ హద్దురాయిని ఢీకొడితే మాత్రం ప్రమాద తీవ్రత పెరిగేదని స్థానిక సాక్షులు తెలిపారు.

శ్రావణ శోభ


ధారూరు: కపిలేశ్వరస్వామి పూజలో భక్తులు


అనంతగిరి: వీరశైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో అన్నదానం


కొడంగల్ రూరల్: మహాదేవుడి ఆలయంలో శివపురాణం పఠిస్తున్న అక్కమహాదేవి భజన మండలి సభ్యులు


తాండూరు టౌన్: సిమి నాగమ్మ అలంకరణలో భావిగి భద్రేశ్వర స్వామి


కొడంగల్: వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక అలంకరణలో నాగదేవత

శ్రావణమాస తొలి సోమవారం సందర్భంగా ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. స్వామి వారి దర్శనానికి ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. శివాలయాల్లో పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. పలు ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

– వికారాబాద్ నెట్‌వర్క్


మోమిన్‌పేట: ప్రత్యేక అలంకరణలో రాళ్లగుడుపల్లి రామలింగేశ్వర స్వామి


అనంతగిరి: దర్శనం కోసం బారులు తీరిన భక్తులు


అనంతగిరి: బుగ్గలో శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు


మోమిన్‌పేటలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

సీపీఎస్ రద్దుకు ఉద్యమిస్తాం

పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్

మోమిన్‌పేట: ఉపాధ్యాయులు, ఉద్యోగులకు గుదిబండగా మారిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్) రద్దుకు ఉద్యమం చేస్తామని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్ అన్నారు. మండల పరిధిలోని పలు పాఠశాల్లో సోమవారం సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పాత పెన్షన్ పద్ధతిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈమేరకు సెప్టెంబర్ 1న ఇందిరా పార్కు వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి దండు రమేశ్, గౌరవ అధ్యక్షుడు ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ

అనంతగిరి: మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల వేతనాలు, బిల్లులను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. అప్పులు చేసి వంటలు చేస్తున్నామని.. బిల్లులు సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ బిల్లులను యూ కుబేరా నుంచి కాకుండా గతంలో మాదిరిగానే గ్రీన్ చానల్ ద్వారా అందజేయాలన్నారు. లేదంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఎన్నికల హామీ మేరకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. వంటకు ప్రభుత్వమే గ్యాస్ పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా జిల్లా అధ్యక్షుడు అలీ, ఉపాధ్యక్షుడు, రవికుమార్, రాజు, శ్రీశైలం, అనంతయ్య, కృష్ణయ్య, యాదయ్య, సత్యమ్మ, ఖాసీంబీ, శాంతమ్మ, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.


అనంతగిరి: లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

రెవెన్యూ సేవలు సులభతరం చేయాలి

బొంరాస్‌పేట: రెవెన్యూ సేవలను సులభతరం చేయాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. సోమవారం ఆయన తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ సేవలను పరిశీలించారు. తహసీల్దారు పద్మావతితో మాట్లాడి రికార్డులను పరిశీలించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వినతులపై ఆయన సమీక్షించారు. గ్రామాల వారీగా దరఖాస్తుల పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సిబ్బంది క్షేత్ర పరిశీలనకు వెళ్లి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఆయన వెంట ఆర్‌ఐ శిరీష తదితరులు ఉన్నారు.

వికలాంగుల పింఛన్ పెంచాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్

యాచారం: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వికలాంగుల పింఛన్లు పెంచాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ డిమాండ్ చేశారు. యాచారం మండలం గునుగల్ గ్రామంలో సోమవారం సమితి మండల అధ్యక్షుడు మహేశ్ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్, ఎంఎస్పీ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికలాంగులకు రూ.6 వేలు, చేయూత పింఛన్ను రూ.4 వేలకు పెంచాలని కోరారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేసి, ఎంతో మంది పేదలకు న్యాయం చేశామని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి, హామీ ప్రకారం పింఛన్ డబ్బులు పెంచాలని కోరారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సదరం సర్టిఫికెట్లు లేక అర్హులైన వికలాంగులకు పింఛన్ మంజూరు కావడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి, సదరం ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ నాయకులు జంగయ్య, వెంకటేశ్, వై.జంగయ్య, సతీష్, సుధాకర్, కొండల్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్

కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు

తాండూరు: నియోజకవర్గంలో కాంగ్రెస్ బలం రోజు రోజుకు పెరుగుతోందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఎంపీటీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి సత్యమూర్తి, 23వ వార్డు నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో హస్తం గూటికి చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి సమర్థవంతంగా ప్రజా పాలన అందిస్తోందన్నారు. నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తాండూరు ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడ్, మాజీ కౌన్సిలర్లు నీరజ, ప్రభాకర్‌గౌడ్, నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, అబ్దుల్ రవూఫ్, నర్సింలు తదితరులున్నారు.

మంత్రుల పర్యటన విజయవంతం చేయాలి

మంత్రుల పర్యటనను విజయవంతం చేయాలని తాండూరు ఎమ్మెల్యే బీఎంఆర్ అధికారులు, ప్రజా ప్రతినిధులకు సూచించారు. సోమవారం పట్టణ శివారులోని జీపీఆర్ ఫంక్షన్‌హాల్‌ను ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, రూరల్ సీఐ నాగేష్, మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డిలతో పాటు పలు శాఖల అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. మంగళవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు, మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి తాండూరులో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంత్రులు తొలుత ఉదయం 11గంటలకు యాలాల మండలం జుంటిపల్లి రామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. 11.30 గంటలకు దౌలాపూర్‌లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన, అనంతరం నియోజకవర్గంలోని ఆరుగ్రామాలలో 33/11 కేవీ సబ్ స్టేషన్‌ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని చెప్పారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.


ఎమ్మెల్యే బీఎంఆర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి సత్యమూర్తి

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

షాద్‌నగర్‌రూరల్: గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సుశీల తెలిపిన ప్రకారం.. లింగారెడ్డి గూడ శివారులోని ఐడియల్ స్కూల్ ఎదురుగా ఉన్న వెంచర్‌లో సోమవారం గుర్తు తెలియని మహిళ (45) మృతదేహం కుళ్లిన స్థితిలో కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతురాలి వివరాలు తెలియరాలేదు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

రాజేంద్రనగర్: ఇంట్లోని రిఫ్రిజిరేటర్ ఓపెన్ చేసేందుకు యత్నించిన ఓ మహిళ విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. ఈ ఘటన సోమవారం రాజేంద్రనగర్ ఠాణా పరిధిలోని ఎర్రబోడ ప్రాంతంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారంఎర్రబోడకు చెందిన పి.లావణ్య (40) ముగ్గురు పిల్లలతో కలిసి జీవిస్తోంది. సోమవారం ఉదయం ఆమె ఇంట్లోని ఫ్రిజ్ తెరుస్తుండగా విద్యుత్ విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబ సభ్యులు ఆమెను ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జూనియర్ కళాశాల ఏర్పాటుకు వినతి

ధారూరు: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నెల్లి జనార్దన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన సభ్యులతో కలిసి కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో మేజర్ మండలంగా పేరున్న ధారూరుకు 34 పంచాయతీలు, 16 అనుబంధ తండాలు, గ్రామాలున్నాయన్నారు. మండలం వ్యవస్థ ఏర్పడిన నాటి నుంచి జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నూతనంగా ఏర్పాటు అయిన బొంరాస్‌పేట, దౌల్తాబాద్‌లోనూ నూతన కళాశాల మంజూరు అయ్యాయని కలెక్టర్‌కు వివరించారు. కళాశాల లేకపోవడంతో ఎక్కువ మంది విద్యార్థులు పదోతరగతితోనే చదువు ఆపేస్తున్నారని వివరించారు. దీంతో బాల్యవివాహాలు సైతం పెరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

లారీ ఢీకొని బాలుడి దుర్మరణం

చైతన్యపురి: బైక్‌పై వెళుతున్న బాలుడిని వేగంగా వచ్చిన లారీ ఢీ కొనటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన సరూర్‌నగర్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహేందర్ తెలిపిన ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా, గోపంపేటకు చెందిన బోయ వెంకటేశ్ కుమారుడు అనిల్ (15) 15 రోజుల క్రితం నగరానికి వచ్చి నాగోల్‌లో ఉంటూ మెకానిక్ పని నేర్చుకుంటున్నాడు. ఆదివారం రాత్రి అతను స్నేహితుడితో కలిసి బైక్‌పై ఎల్‌బీనగర్ నుంచి దిల్‌సుఖ్‌నగర్ వెళుతుండగా పీఎం హోం మెట్రో స్టేషన్ సమీపంలో వెనక నుంచి వేగంగా వచ్చిన లారీ వీరి బైక్‌ను ఢీకొట్టింది. కిందపడిన అనిల్ మీదుగా లారీ చక్రాలు వెళ్లడంతో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అతని స్నేహితుడికి కాలు విరిగింది. డ్రైవర్ లారీని వదిలేసి పరారయ్యాడు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భోజనం బాగుందా?

నవాబుపేట: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని డీఈఓ రేణుకాదేవి ఆదేశించారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలను సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. మెనూ పాటిస్తున్నారా.. భోజనం బాగుంటోందా..? అని ప్రశ్నించారు. పాఠశాల, కళాశాల, హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీఓ అనురాధ, ప్రిన్సిపాల్ కృష్ణ కుమార్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే ఇంటి ముట్టడి

- ఫార్మాసిటీ బాధిత రైతుల ఆందోళన
- ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్
- సీఎం దృష్టికి తీసుకెళ్తానని మల్‌రెడ్డి హామీ


నగరంలోని తిరుమల హిల్స్‌లో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఇంటి ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఫార్మాసిటీ భూ బాధిత రైతులు

యాచారం: నగరంలోని తిరుమల హిల్స్‌లో ఉన్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఇంటిని సోమవారం ఫార్మాసిటీ బాధితులు ముట్టడించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో తమకు ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించిన ప్లకార్డులను చేతబట్టి ఆందోళన నిర్వహించారు. యాచారం మండలం నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన దాదాపు 250 మందికి పైగా ఉదయాన్నే ఎమ్మెల్యే ఇంటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దు చేసి, రైతుల భూములను తిరిగి వారి పేరున నమోదు చేస్తామని చెప్పారన్నారు. ఫార్మాసిటీ కోసం తమ పట్టా భూములను ఇవ్వకపోవడంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పరిహారాన్ని అథారిటీలో జమ చేసిందని మండిపడ్డారు. ఆతర్వాత రికార్డుల్లో తమ వివరాలను తొలగించి, టీజీఐఐసీ పేరున మార్చారన్నారు. పరిహారంలో భాగంగా ఇటీవల ప్లాట్లను సైతం కేటాయించారని తెలిపారు. ఫార్మాసిటీని రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వంతో ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు.

సీఎంతో మాట్లాడుతా

ఆందోళనకారులను ఉద్దేశించి ఎమ్మెల్యే రంగారెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఫార్మాసిటీని రద్దు చేసి, ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నారని తెలిపారు. ఈ విషయమై సీఎంతో చర్చించి న్యాయం జరిగేలా చూస్తానన్నారు. భూసేకరణ అంశం కోర్టు పరిధిలో ఉన్నందున తానేమీ మాట్లాడలేనని చెప్పారు. బాధిత రైతుల తరఫున ఓ ప్రతినిధి బృందం పూర్తి వివరాలతో వస్తే కలెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

వ్యక్తి బలవన్మరణం

శంకర్‌పల్లి: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. సీఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పర్వేదకు చెందిన బుచ్చయ్యకి కుమారుడు వెంకటేశ్ (24) ఉన్నాడు. గ్రామ శివారులోని ఓ ప్రైవేటు సంస్థలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల కుటుంబంలో అప్పులు అధికమయ్యాయి. తండ్రీకొడుకుల మధ్య తరచూ వాగ్వాదాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో ఆదివారం అవి తారాస్థాయికి చేరడంతో మనస్తాపానికి గురైన వెంకటేశ్.. అర్ధరాత్రి ఇంట్లో ఫ్యాన్‌కి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ ఉల్లంఘనులపై కేసులు

శంషాబాద్: ఆర్‌జీఐఏ ట్రాఫిక్ ఠాణా పరిధిలో ఇటీవల నమోదైన 33 కేసుల్లో ఒకరి జైలు శిక్షతో పాటు మిగతా వారిని నుంచి జరిమానా వసూలు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిలో ఓ వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానాను కోర్టు విధించిందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 17 మంది నుంచి రూ.50 వేలు జరిమానా, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన వారి నుంచి రూ. 32 వేల జరిమానా వసూలు చేశారమన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు.